సాక్షి
కాకినాడ
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



కమనీయం.. కడు రమణీయం

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి పొందిన వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు రమణీయంగా జరుగుతున్నాయి.

8లో



రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు, శాంతి హోమాన్ని వేద పండితులు సోమవారం ప్రారంభించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,94,263 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.80 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

షేర్ మార్కెట్ పేరిట ఘరానా మోసం

రూ.74.36 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

రాజానగరం: షేర్ మార్కెట్ ద్వారా డబ్బులు పండించుకోవాలనే అతడి కోరికను సైబర్ మోసగాళ్లు 'క్యాష్' చేసుకున్నారు. దొరికినంతా దోచుకున్నారు. దఫదఫాలుగా రూ.74 లక్షలకు పైగా పోగొట్టుకున్న తరువాత కానీ తాను మోసపోయాననే విషయాన్ని అతడు గ్రహించలేకపోయాడు. జరిగిన చీటింగ్ తెలిసిన వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. స్థానిక ఎస్సై జీవీవీ సత్యనారాయణ సోమవారం రాత్రి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అతడికి స్టాక్ మార్కెట్‌లో వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ మేరకు ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో సెర్చ్ చేసి, ఆగస్టు 17న సవర్ట్ ట్రేడింగ్ యాప్ డౌన్‌లోడ్ చేసి, యాడ్ అయ్యాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలంటే డీమ్యాట్ అకౌంట్ ఓపెన్ చేయాలని వారు చెప్పడంతో ఆవిధంగా చేశాడు. ఆ తరువాత వచ్చిన మెసేజీలను అనుసరిస్తూ తన వివరాలన్నీ ఆ యాప్‌లో నమోదు చేశాడు. అకౌంట్ క్రియేట్ అయిందని అవతలి వ్యక్తులు చెప్పారు. అనంతరం షేర్ మార్కెట్ లావాదేవీల పేరిట ఉమాకాంత్ దఫదఫాలుగా రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అనంతరం, ఆ మొత్తం ఫ్రీజ్ అయిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58.55 లక్షలు వేయాలని అవతలి వ్యక్తులు చెప్పడంతో ఉమాకాంత్‌కు అనుమానం వచ్చింది. తాను మోసపోయానని గ్రహించి, రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వసతి గృహాల్లో సదుపాయాలకు చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలోని సాంఘిక, గురుకుల, బీసీ, గిరిజన సంక్షేమ, కేజీబీవీ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల అధికారులు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంక్షేమ వసతి గృహాల్లో ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, మౌలిక సదుపాయాల కల్పనకు గుర్తించిన, ప్రతిపాదించిన పనుల వివరాలు, మధ్యాహ్నం భోజనం నాణ్యత వంటి అంశాలపై చర్చించారు. జిల్లాలో 88 వసతి గృహాలున్నాయన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రతి వారం తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో భోజనం నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, వసతి గృహాల పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీఓ, వైద్య, ఆరోగ్యం, విద్యుత్ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన నివేదికలు సమర్పించాలన్నారు. పట్టణాల్లోని వసతి గృహాల్లో మున్సిపల్ కమిషనర్లు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 353 అర్జీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 353 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు, ఆన్‌లైన్‌లో భూమి వివరాల నమోదు, ఇతర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

తునిలో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న దాడిశెట్టి రాజా



కాకినాడలో జరిగిన నిరసన ప్రదర్శనలో వైఎస్సార్ సీపీ నేత కురసాల కన్నబాబు, నాయకులు



నకిలీపై సమరం

- నకిలీ మద్యానికి వ్యతిరేకంగా కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద నిరసన
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆందోళన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మద్యపాన వ్యసనానికి ప్రజలను దూరం చేసి, వారి ఆరోగ్యాన్ని, తద్వారా సమాజంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ, ఫుల్ కిక్ ఇచ్చే మద్యాన్ని అందిస్తామంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కో మందుబాబులకు వల వేశారు. వారి బలహీనతతో ఆటాడుకుని, ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చారు. అప్పటి వరకూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం షాపులను కూటమి నేతలకు కట్టబెట్టారు. తద్వారా వారికి 'సంపద సృష్టించారు.' అధిక ధరలకు మద్యం అమ్మకాలు మొదలుపెట్టి ఎడాపెడా దోచుకోవడం మొదలెట్టారు.. వీధివీధినా బెల్టు షాపులు తెరచి, మద్యం ఏరులై పారిస్తున్నారు. డోర్ డెలివరీ సైతం ఇస్తున్నారు. ఇది చాలదన్నట్టు టీడీపీ నేతలు విచ్చలవిడిగా నకిలీ మద్యం సరఫరా చేస్తూ మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజలకు చేటుగా పరిణమించిన ఈ నకిలీ మద్యం, బెల్టు షాపులకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ సోమవారం పోరుబాట పట్టింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమాల్లో.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానను సైతం లెక్క చేయకుండా.. ప్రజలు పెద్ద సంఖ్యలో కదం తొక్కారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టాలని, బెల్టు షాపులను ఎత్తివేయాలని, మద్యం అమ్మకాలకు నిర్దేశిత సమయాలు పాటించాలని, నకిలీ మద్యం కుంభకోణంపై సిట్‌తో కాకుండా సీబీఐ విచారణ జరిపించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తుని, కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఎక్సైజ్ కార్యాలయాల వరకూ భారీ ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



తుని ఎక్సైజ్ స్టేషన్‌కు ర్యాలీగా వస్తున్న దాడిశెటి రాజా, నాయకులు, కార్యకర్తలు



కాకినాడలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కురసాల కన్నబాబు

తుని

తుని రైల్వే బ్రిడ్జి నుంచి పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎదుట నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యాన వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఈ ర్యాలీలో కదం తొక్కారు. కూటమి సర్కార్ మద్యం విధానానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యనమల కృష్ణుడు, రాయి మేరీ అవినాష్, కోరుమిల్లి లలిత, నాగం దొరబాబు, సకురు నాగేంద్ర నెహ్రూ, రేలంగి రమణగౌడ్, పోతల రమణ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎన్ సిట్ కాదు.. సీబీఐ విచారణ కావాలి

'రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా మార్చి టీడీపీ నాయకులు వేల కోట్లు దిగమింగారు. ఇప్పటి వరకూ బెల్టు షాపులకు పరిమితమైన నేతలు ఇప్పుడు నకిలీ మద్యం ఏరులై పారిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నకిలీ మద్యంపై సీబీఎన్ (చంద్రబాబు నాయుడు) సిట్‌తో కాకుండా సీబీఐ విచారణ జరిపించాలి' అని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి, స్థానిక ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ (డీసీ) కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. కార్యాయల సిబ్బంది ఎంతకూ గేటు తెరవలేదు. దీంతో, నకిలీ మద్యం, బెల్టు షాపులకు వ్యతిరేకంగా వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చామని నాయకులు చెప్పడంతో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక బయటకు వచ్చారు. ఆమెకు కన్నబాబు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటి వరకూ మద్యం విచ్చలవిడిగా విక్రయాలు, అధిక రేట్లు, బెల్టు షాపుల గురించి మాత్రమే చూశామని.. ఇప్పుడు ఏకంగా నకిలీ మద్యం ద్వారా వేల కోట్లు దిగమింగారని ఆరోపించారు. నకిలీ మద్యం కోసం స్పిరిట్ నుంచి లేబుళ్ల వరకూ వారే పెట్టేశారని, 15 నెలల నుంచి జరుగుతున్నా ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. తెలియకపోతే చేతకానితనమని, తెలిస్తే పార్టనర్‌షిప్‌గా భావించాల్సి వస్తుందని, రెండింటిలో ఏదో ఒకటి చెప్పాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి నకిలీ 'ఎన్' బ్రాండ్‌లు ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మద్యం మరణాలు 421 ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయన్నారు. నకిలీ మద్యంపై వార్తలు రాస్తున్న 'సాక్షి'పై కక్ష కట్టి గొంతు నొక్కాలని ఎడిటర్, విలేకర్లపై కేసులు పెట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సాక్షి'పై కేసులు ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు అని, ఇదేవిధంగా కక్ష కడితే చంద్రబాబుకు కొమ్ము కాస్తున్న పచ్చ పత్రికలు కనిపించవని, ఇది సోషల్ మీడియా యుగమనే విషయం గుర్తుంచుకోవాలని కన్నబాబు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, పార్టీ ఎస్ఈసీ సభ్యులు బెజవాడ సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, సరోజ, మాకినీడి శేషుకుమారి, మైనార్టీ సెల్ నేత కరీం బాషా, పి.నాగబాబు, కొప్పిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దు

విచ్చలవిడిగా సాగుతున్న నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై సీబీఐ విచారణ చేపట్టాలి. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా నాణ్యమైన మద్యం తక్కువ ధరకే సరఫరా చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అక్రమ కేసులు పెడుతూ నాయకులను ప్రభుత్వం వేధిస్తోంది. మద్యం దుకాణాలను కూటమి నేతలు తమ అనుచరులకు అప్పగించారు. నకిలీ మద్యం తాగిన వ్యక్తులు నాలుగైదు రోజుల్లో జవసత్వాలు కోల్పోతున్నారు. నకిలీ మద్యంపై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్నప్పటికీ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. చేతులు దులుపుకొనేందుకే చంద్రబాబు సిట్, సీఐడీ విచారణ అంటున్నారు. వేల కోట్ల రూపాయల స్కాములు చేసిన చంద్రబాబు, లోకేష్‌లు ఇకనైనా ప్రజల ఆరోగ్యంతో ఆటలాడకుండా నాణ్యమైన మద్యం అందించాలి.

– దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

'ఎన్' బ్రాండ్ నకిలీ మద్యం

కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని పాలన సాగిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మద్యం షాపులను నిబంధన మేరకే నిర్వహించారు. నేడు కూటమి సర్కారు వేలాదిగా బెల్టు షాపులు తెరచి 'ఎన్' బ్రాండ్ నకిలీ మద్యం విక్రయిస్తోంది. దీనిని తాగిన మందుబాబులు మృత్యువాత పడుతున్నారు. నకిలీ మద్యం నిందితులు పట్టుబడుతున్నా ఎక్కడ బెల్టు షాపు కానీ, మద్యం దుకాణం కానీ సీజ్ చేయలేదు.

– వంగా గీతా విశ్వనాథ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



పిఠాపురంలో వంగా గీత ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



రోడ్డుపై బైఠాయించి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గీత

పిఠాపురం

నియోజకవర్గం నలుమూలల నుంచీ తరలి వచ్చిన జనసందోహంతో పాటు నాయకులు, కార్యకర్తలు వెంట రాగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత ఆధ్వర్యాన పిఠాపురంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జోరుగా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా సీతయ్యగారితోట హార్వర్డ్ స్కూల్ వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకూ మొక్కవోని పట్టుదలతో ర్యాలీలో పాల్గొన్నారు. గీత రోడ్డుపై బైఠాయించి కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపి, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయి, పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, నాయకులు కొత్తెం దత్తుడు, జవ్వాది కృష్ణమాధవరావు, ఉలవల భూషణం, వజ్రపు వీరేష్, ముమ్మిడి శ్రీను, అడపా రఘు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం

వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యాన సామర్లకోటలోని పార్టీ కార్యాలయం నుంచి పెద్దాపురంలోని ఎక్సైజ్ కార్యాలయం వరకూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సామర్లకోట – పెద్దాపురం రోడ్డు నుంచి పాదయాత్రగా నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్సైజ్ సీఐ కేవీవీ దుర్గార్జునరావుకు వినతి పత్రం అందజేశారు. వరి సాగులో ఎరువుల వాడకం వలన హాని జరుగుతుందని ప్రచారం చేస్తున్న చంద్రబాబుకు నకిలీ మద్యం వలన ప్రజల ప్రాణాలు పోతాయనే విషయం తెలియదా అని ఎక్సైజ్ అధికారులను మహిళలు నిలదీశారు. నారావారి నకిలీ మద్యం అరికట్టాలని, బెల్టు షాపులను రద్దు చేయాలని నినదించారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, సామర్లకోట ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ పరిశీలకుడు, సీఈసీ సభ్యుడు గోపు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో నకిలీ మద్యానికి నిరసనగా పాదయాత్ర చేస్తున్న దొరబాబు తదితరులు

తీరంలో 'అల'జడి

కోతకు గురవుతున్న మత్స్యకారుల ఇళ్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం కాకినాడ జిల్లా ఉప్పాడ వద్ద సముద్ర అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో సూరాడపేట, మాయాపట్నం పాత మార్కెట్‌లోని మత్స్యకారుల ఇళ్లు కళ్ల ముందే కోతకు గురవుతున్నాయి. రాత్రికి రాత్రే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇళ్లతో పాటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వృక్షాలు సైతం నెలకొరుగుతున్నాయి. రూ.లక్షలతో నిర్మించుకున్న ఇళ్లు రాకాసి అలల ధాటికి మొండి గోడలుగా మిగులుతుండటంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– కొత్తపల్లి



ఉప్పాడ తీరంలో కోతకు గురవుతున్న మత్స్యకారుల గృహాలు



కోతకు గురై సముద్రంలో కలిసిపోయిన సీసీ రోడ్డు



ఉప్పాడ తీరంలో ఇలా..

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

రోడ్డు ప్రమాదంలో రికార్డ్ అసిస్టెంట్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

అనపర్తి, రాయవరం: రోడ్డు ప్రమాదంలో జూనియర్ కళాశాల రికార్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్ (52) రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. రోజూలాగే వేమగిరి నుంచి అనపర్తి కొప్పవరం మీదుగా రాయవరంలోని కళాశాలకు బయలుదేరారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుండడంతో కొప్పవరం గ్రామ శివారుకు చేరుకునే సరికి ఆయన బైక్ రోడ్డుపై జారిపోయింది. వాహనంతో పాటు ఆయన రోడ్డుపై పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు గమనించారు. ఆయన జేబులోని సెల్‌ఫోన్ తీసి రాయవరం కళాశాలలోని సహోద్యోగులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి హుటాహుటిన అనపర్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందారు. ఈ మేరకు ట్రైనీ ఎస్సై సుజాత కేసు నమోదు చేశారు.



వాడపల్లిలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



స్వామివారికి పూజలు చేస్తున్న ఈఓ చక్రధరరావు, వెంకట్రాజు



ఆకట్టుకున్న మహిళల సాంస్కృతిక ప్రదర్శన

కమనీయం.. కడు రమణీయం

- వాడపల్లిలో శ్రీనివాసుని కల్యాణం
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- యోగనారసింహ అలంకరణలో శ్రీవారు విహారం



సింహ వాహనంపై యోగనారసింహ అలంకరణలో శ్రీవారి ఊరేగింపు

కొత్తపేట: శ్రీవారు ఓరకంట చూడగా.. అమ్మవారు సిగ్గులమొగ్గగా మారగా.. జగద్రక్షకుడి కల్యాణం కన్నుల పండువగా జరగ్గా.. ఈ క్రతువును తిలకించిన భక్తజనం మురిసిపోగా.. కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీనివాసుని కల్యాణం అట్టహాసంగా జరిగింది. బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం చూసిన కనులదే భాగ్యం అన్నట్టు సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం కల్యాణోత్సవాన్ని, వాహన సేవను తిలకించి పులకించింది. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం, వివిధ ప్రాంతాల వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు తదితర పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టకలశారాధన, మహా స్నపనం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పం, దిగ్దేవతా బలిహరణ తదితర పూజలు నిర్వహించారు.

కనుల వైకుంఠం.. శ్రీనివాసుని కల్యాణం

లోక సంక్షేమార్థం శ్రీనివాసుని కల్యాణ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రదానం నుంచి తలంబ్రాల వరకూ వేదపండితుల వ్యాఖ్యానం నడుమ వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితులైన స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి తీసుకువచ్చి మండపంలో అలంకరించారు. దేవస్థానం తరపున డీసీ అండ్ ఈఓ చక్రధరరావు దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, కల్యాణ మాలలు తదితరాలు సమర్పించారు. నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి స్వస్తివచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేషార్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పం జరిపారు.

నేటి కార్యక్రమాలు ఇవీ..

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం బ్రహ్మోత్సవాల నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు ఉదయం వసంతోత్సవం, అష్టదళ పాదపద్మారాధన నిర్వహిస్తారు. సాయంత్రం హనుమత్ మూలమంత్ర హవనం, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసం విశేష పూజలు, సేవలు, రాత్రి మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ నిర్వహిస్తారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీవారు

శ్రీవారు యోగనారసింహ అలంకరణలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై స్వామివారిని అలంకరించగా, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పండితులు సింహ వాహనంపై శ్రీవారు విహార ఘట్టం విశిష్టతను వివరించారు. ఈ ఘట్టం భక్తులకు ఐశ్వర్యం, యశస్సు, శ్రీ, జ్ఞానం తదితర గుణాలను ప్రసాదిస్తారని అర్థం. సింహం ధైర్యం, వేగం, చురుకుదనానికి ప్రతీక. కాబట్టి స్వామివారు ఈ వాహనంపై ఊరేగుతూ పైలక్షణాలను అనుగ్రహిస్తారు. యోగనారసింహ రూపంలో శ్రీవారిని దర్శించిన వారికి మంచి జరుగుతుందని వివరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వర స్వామివారి వేషధారణలో ఒక కళాకారుడు ఆకట్టుకున్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము బందోబస్తు నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి వేషధారణలో ఓ కళాకారుడు

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన బాలికలు



ఎంపికైన బాలురు

పెదపూడి: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జి.మామిడాడ జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి, లయన్స్ క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలోని జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ద్వారంపూడి దివాకర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 బాలుర, బాలికల విభాగాల్లో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, మండ రాజారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పడాల గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎంపికలు స్థానిక లయన్స్ క్లబ్, జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ సహకారంతో నిర్వహించామన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ సభ్యులు టీఎస్‌వీఆర్ మూర్తి, ఫిజికల్ డైరెక్టర్లు ద్వారంపూడి యువరాజారెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగాంలో కొండముచ్చు దాడి

ఐదుగురికి తీవ్ర గాయాలు



కొండముచ్చు దాడిలో రాజేష్ కాలికి గాయం

అయినవిల్లి: మాగం గ్రామంలో ఓ కొండముచ్చు రెండు రోజుల్లో ఐదుగురిపై దాడి చేసింది. ఆ గ్రామానికి చెందిన బి.సత్యనారాయణ, బొడపాటి రాజేష్, కొట్టల శ్రీనులు పొలం నుంచి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో కొండముచ్చు దాడి చేసి గాయపరిచింది. ఇలా మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిందని గ్రామస్తులు చెప్పారు. బాధితులు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొండముచ్చు దాడి ఘటనపై అటవీ శాఖ అధికారులకు పంచాయతీ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. గతంలో కూడా 15 మందిపై దాడి చేసినా అధికారులు స్పందించలేదని అంటున్నారు. ఇప్పటికైనా కొండముచ్చులను అదుపులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలల పరిరక్షణ కేంద్రానికి బాలుడి అప్పగింత



బాలుడి (నిక్కర్ ధరించిన వ్యక్తి)ని బాలల పరిరక్షణ కేంద్రం అధికారికి అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని స్థానికుడు కె.సందీష్ గుర్తించి, వివరాలు అడిగినా చెప్పకపోవడంతో రైల్వే పోలీసులకు అప్పగించాడు. రైల్వే పోలీసులు ఆ బాలుడితో మాట్లాడే ప్రయత్నం చేశారు. అతను తమిళంలో తన పేరు యోగి అని మాత్రమే చెప్పడంతో జీఆర్పీ పోలీసులు ఉన్నతాధికారులను సంప్రదించి, తర్వాత కాకినాడలోని బాలల పరిరక్షణ కేంద్రానికి అప్పగించారు. ఆ బాలుడు ఇంటి నుంచి కోపగించి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు ప్రారంభం




రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆలయంలోని దర్బారు మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు ఈ పూజలు, హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలుత కలశాలతో మండపారాధన చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఈ పూజలు నిర్వహించారు. తర్వాత శాంతి హోమానికి అంకురార్పణ చేశారు. అన్నవరం దేవస్థానంలో కొన్ని నెలలుగా అనేక అగ్ని ప్రమాదాలు, అపశ్రుతులు జరిగిన నేపథ్యంలో ఈ సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు పండితులు తెలిపారు. బుధవారం ఉదయం శాంతి హోమం పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. తరువాత మంత్ర జలాన్ని దేవస్థానం ఆవరణలో వెదజల్లి శుద్ధి చేస్తారు. దేవస్థానంలో చాలాకాలంగా సంప్రోక్షణ పూజలు కాని, ప్రత్యేక యాగాలు, కోటి తులసి పూజలు కాని జరగకపోవడంతో మూడు నెలల నుంచి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పండితులు, అర్చకస్వాములు అభిప్రాయపడ్డారు. దీనిపై ఈ నెల 7న 'సాక్షి' దినపత్రికలో 'అపశ్రుతులు అందుకేనా..?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దానికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు స్పందించి శాంతి పూజలు నిర్వహించాలని దేవస్థానం పండితులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పూజల్లో చైర్మన్ ఐవీ రోహిత్‌తో పాటు వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు దత్తాత్రేయ శర్మ, కంచిబట్ల సాయిరామ్, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు తదితర బృందం పాల్గొన్నారు.

కళాశాల బస్సును ఢీకొన్న వ్యాన్

13 మంది విద్యార్థులకు గాయాలు



కృష్ణంపాలెం వద్ద ప్రైవేట్ కళాశాల బస్సును ఢీకొని నుజ్జయిన వ్యాన్

దేవరపల్లి: ప్రైవేటు కళాశాల బస్సును బొలెరో వ్యాన్ ఢీకొన్న ఘటనలో బస్సులోని 13 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వద్ద ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు సుమారు 40 మంది విద్యార్థులతో సోమవారం ఉదయం కళాశాలకు వెళుతుండగా, కృష్ణంపాలెం వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి కిరాణా సరకులతో వెళుతున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేసి ఇళ్లకు పంపించారు. వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

కొత్తపేట: రోజూ మద్యం తాగి వస్తున్నాడని భార్య మందలించడంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై జి.సురేంద్ర కథనం ప్రకారం.. పలివెల శేరిపాలెం గ్రామానికి చెందిన అరిగెల నాగభూషణం (34) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి తన పడక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. భార్య తలుపుకొట్టినా తీయలేదు. దానితో ఆమె ఇంటి పక్కనే ఉన్నవారిని పిలవగా వారు వచ్చి బలవంతంగా తలుపులు తీసి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. వెంటనే కిందకు దించి కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నాగభూషణం మద్యానికి బానిస కావడంతో భార్య మందలించిందనే మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై తెలిపారు.